సాక్షి మహబూబాబాద్

శనివారం | 7 | డిసెంబర్ | 2024



గూడ్స్ రైలు బోగిలో పొగలు

రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. - 8లో▸



హైటెక్ హంగులు

అమృత్‌భారత్ పథకంలో భాగంగా కాజీపేట జంక్షన్‌ను కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం

35.8°/21.9°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

కౌన్సిలర్లను అవమానిస్తున్న చైర్మన్



తొర్రూరు: అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించకుండా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తమను అవమానిస్తున్నారని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ..చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణకు కొనుగోలు చేసిన వాహనాల ప్రారంభోత్సవం చేపట్టగా తమను ఆహ్వానించలేదని తెలిపారు. ఎమ్మెల్యే పాల్గొన్న కార్యక్రమానికి కౌన్సిలర్లను ఆహ్వానించకపోవడం నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఎన్నమనేని శ్రీనివాసరావు, కౌన్సిలర్లు గుగులోతు శంకర్, ధరావత్ సునీత, పేర్ల యమున, కర్నె నాగజ్యోతి పాల్గొన్నారు.

ముగిసిన ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు


డోర్నకల్: డోర్నకల్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు ఎన్నికలు శుక్రవారం ముగిశాయి. రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో ఏర్పాటు చేసిన 23వ పోలింగ్ కేంద్రం పరిధిలో 847 మంది ఉద్యోగులకు ఓటు హక్కు ఉండగా.. మూడు రోజుల్లో 703 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా 83 శాతం పోలింగ్ నమోదైంది. ఈ నెల 16న ఎన్నికల ఫలితాలు వెల్లడి కానున్నాయి. గుర్తింపు ఎన్నికలను మజ్దూర్ యూనియన్, ఎంప్లాయీస్ సంఘ్ ప్రతినిధులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ప్రచారం నిర్వహించాయి. ఎన్నికల సందర్భంగా గొడవలు జరగకుండా ఆర్‌పీఎఫ్ సిబ్బంది పోలింగ్ కేంద్రంతో పాటు పరిసరాల్లో బందోబస్తు నిర్వహించగా ఎన్నికలు ప్రశాంతంగా జరగడంతో ఊపిరి పీల్చుకున్నారు.

రామాలయ అర్చకుడికి ఇల్లు కట్టిస్తున్న దాత



గార్ల: మండలంలోని సీతంపేట గ్రామంలోని రామాలయ అర్చకుడిగా పనిచేస్తున్న యాద గిరిస్వామికి అదే గ్రామానికి చెందిన దాత ఊరుగొండ శ్రీనివాసరావు ఇల్లు నిర్మించి ఇస్తున్నాడు. ఈమేరకు శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ.. అర్చకుడు దేవాలయం, భక్తులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతోనే ఇల్లు నిర్మించి ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఇల్లు నిర్మిస్తున్న దాతను గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో దాతతో పాటు అర్చకులు రామాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా కొట్టి... వివాహ విందుకు హాజరై!



తొర్రూరు: కళాశాల విధులకు డుమ్మా కొట్టి అధ్యాపకులు వివాహ విందుకు హాజరైన ఘటన డివిజన్ కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే...పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు శుక్రవారం వరంగల్‌లో జరిగిన ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కుమారుడి వివాహ రిసెప్షన్‌కు హాజరయ్యారు. 9మంది అధ్యాపకులు సెలవు పెట్టకుండా వివాహం పేర డుమ్మా కొట్టారు. దీంతో కళాశాలకు వచ్చిన విద్యార్థులు క్లాసులు తీసుకునేందుకు అధ్యాపకులు లేకపోవడంతో ఇంటి బాట పట్టారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీనిపై స్థానికులు ఇంటర్ విద్యా విభాగం ఆర్జేడీకి ఫిర్యాదు చేశారు. ఆర్జేడీ ఆదేశానుసారం డీఐఈఓ మదార్ కళాశాలను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. అధ్యాపకుల వ్యవహారంపై విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని డీఐఈఓ తెలిపారు.

10మంది డీబార్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ మూడో సెమిస్టర్ పరీక్షల్లో వివిధ కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 10మంది విద్యార్థులు స్క్వాడ్లకు పట్టుబడినట్లు పరీక్షల నియంత్రణాధికారి కె.రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలాదేవి తెలిపారు. ఈమేరకు వారిని డీబార్ చేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధే లక్ష్యం..

- ప్రజలు మెచ్చేలా కాంగ్రెస్ ప్రభుత్వ పాలన
- విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలపై ప్రత్యేక దృష్టి
- మౌలిక వసతుల కల్పనకు నిధుల సేకరణ
- సంక్షేమ పథకాల అమలులో వెనక్కి తగ్గేదిలేదు..
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



సాక్షి, మహబూబాబాద్:

'ప్రజలు నన్ను నమ్మకంతో గెలిపించారు. కాంగ్రెస్ పార్టీ నాడు.. నేడు.. ఎప్పుడైనా ప్రజల పక్షాన నిలుస్తుంది. ప్రజల కోసమే పాలిస్తుందనే నమ్మకం డోర్నకల్ ఓటర్లలో ఉంది. వారి నమ్మకాన్ని నిలబెడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నా. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడమే ధ్యేయం' అని రాష్ట్ర ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ఏడాది పూర్తయిన సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

ఏడాదిగా ప్రజలకోసం

ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే పనిలో నిమగ్నమయ్యాం. డోర్నకల్ నియోజకవర్గంలో 57,992 విద్యుత్ వినియోగదారులు ఉండగా ఇందులో తెల్లరేషన్ కార్డులు ఉన్న 29,469 కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల చొప్పున ఇప్పటి వరకు 2,27,41,064 యూనిట్లు ఉచితంగా అందజేశాం. ఇందుకోసం రూ. 7.4కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌శాఖకు చెల్లించింది. 21,761 మంది రైతులకు రూ.199.77కోట్ల పంట రుణాలు మాఫీ చేశాం. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాం. 134 అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధికి రూ. 3.67కోట్లు కేటాయించాం. రూ.7.39కోట్ల గ్యాస్ సబ్సిడీ అందజేశాం. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా 2020 సంఘాలకు రూ. 151.51కోట్ల రుణాలు అందించి, మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రోత్సహించాం. 523 అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూల్స్‌గా మార్చి 5,518 మంది పిల్లలకు మెరుగైన బోధన అందిస్తున్నాం. ఏడాది కాలంలో నియోజకవర్గంలో 127 ఉపాధ్యాయ, 277స్టాఫ్‌నర్సు, 56పోలీస్ ఉద్యోగాలు భర్తీ చేశాం. గ్రూప్–4 అభ్యర్థులు విధుల్లో చేరుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన..

ఒక వైపు హామీలను నెరవేరుస్తూనే.. నియోజకవర్గంలోని మౌలిక వసతుల కల్పన కోసం ప్రయత్నిస్తునాం. ఇందుకోసం రూ. 200కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో ఆర్అండ్‌బీ, పీఆర్, ఐటీడీఏ రోడ్ల మరమ్మతులు చేశాం. అదేవిధంగా నియోజకవర్గంలోని మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీల్లో తాగునీటి కల్పన కోసం రూ.70కోట్లతో పనులు చేపట్టాం. రూ.200కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది. స్థల సేకరణ చేస్తున్నాం. మరి పెడ ఏరియా ఆస్పత్రి నిర్మాణంతో పాటు నర్సింహులపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల నిర్మాణం కోసం టెండర్ ప్రక్రియ పూర్తి అయ్యింది.

అందరి సహకారంతో..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశీస్సులతోపాటు, ఎంపీ బలరాం నాయక్, మంత్రులు, సీనియర్ నాయకుల సహకారంతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ముందు ఉంచేందుకు ప్రయత్నిస్తున్నాం. గిరిజనులు ఎక్కువగా ఉన్న నియోజకవర్గం కావడంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు వెళ్తున్నాం. భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు చేస్తున్నాం. వచ్చే వానాకాలం వరకు తెగిన చెరువులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదిక అందించాం. అంతర్గత రోడ్ల నిర్మాణం, నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు, సంక్రాంతి తర్వాత ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డులు అందజేసే పనిలో ఉన్నాం.

కార్యకర్తలకు అండగా..

కార్యకర్తలు లేకుండా నాయకులు లేరు. వారి కష్టం నా గెలుపులో కీలకం. అందుకోసమే పార్టీకోసం కష్టపడి పనిచేసిన ప్రతీ కార్యకర్తను కంటికిరెప్పలా కాపాడుకునే బాధ్యత నాది. వారికే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీట్లు, నామినేటెడ్ పదవులు, ఇలా వారి వారి అర్హతన బట్టి సేవలను వినియోగించుకుంటాం. ప్రజల ఆశీస్సులతోపాటు అందరి సహకారంతో రాబోయే నాలుగేళ్లలో డోర్నకల్ నియోజకవర్గం అభివృద్ధిలో ముందు ఉండేలా పనిచేస్తా.

స్లిప్ టెస్ట్‌లు నిర్వహించాలి



కురవిలో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్‌రెడ్డి

- డీఈఓ రవీందర్‌రెడ్డి

కురవి: పాఠశాలకు పదో తరగతి విద్యార్థులు వంద శాతం హాజరుకావాలని, ఉపాధ్యాయులు ప్రతీ రోజు అన్ని సబ్జెక్టుల్లో స్లిప్ టెస్ట్‌లు నిర్వహించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కురవి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులందరికీ స్టడీ మెటీరియల్, స్నాక్స్ దాతల ద్వారా అందేలా చూడాలని సూచించారు. విద్యార్థులు తక్కువ సమయంలో బాగా చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం శుభ్రంగా ఉంచాలన్నారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, హెచ్‌ఎం వాహిద్, ఏఎస్‌ఓ సంతోష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈఓ రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకరబోర్డు ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు కోట్యా నాయక్ ఆర్థిక సహకారంతో 43 మంది విద్యార్థులకు స్టడీ మెటరియల్‌ను డీఈఓ పంపిణీ చేశారు. ఏసీజీఈ మందుల శ్రీరాములు, డీఎస్‌ఓ బి. అప్పారావు, ఏఎస్‌ఓ సంతోష్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం

- ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



హోంగార్డులతో కేక్ కట్ చేయిస్తున్న ఎస్పీ

మహబూబాబాద్ రూరల్: హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం హోంగార్డ్ రైజింగ్ డే వేడుకలను నిర్వహించగా ఎస్పీ కేక్ కట్ చేసి హోంగార్డులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. హోంగార్డుల వ్యవస్థను 1946 డిసెంబర్ 6న ఏర్పాటు చేశారన్నారు. ప్రతీ సంవత్సరం డిసెంబర్ 6వ హోంగార్డు రైజింగ్ డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హోంగార్డులు విధులకు హాజరవుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులతో సమానంగా పనిచేస్తున్నారని కొనియాడారు. క్లిష్టతరమైన బందోబస్తులు, శాంతి భద్రతల పరిరక్షణలో విధులు నిర్వహించే పోలీసుల అన్ని విభాగాల్లో హోంగార్డులు తమ వంతు సహకారం అందిస్తున్నారన్నారు. తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారని అన్నారు. ఏఆర్ డీఎస్పీ విజయ్ ప్రతాప్, ఆర్ఐ (హోంగార్డు) భాస్కర్, ఆర్ఐ(వెల్ఫేర్) నాగేశ్వరావు, హోంగార్డులు పాల్గొన్నారు.

మైత్రి ట్రాన్స్ క్లినిక్..

- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే
- జిల్లాలో 500 మంది ట్రాన్స్‌జెండర్లు
- ప్రతీ గురువారం వైద్య పరీక్షలు
- హెల్ప్‌లైన్ నంబర్ 155326



క్లినిక్‌లో ఏర్పాటు చేసిన ఫర్నిచర్

మహబూబాబాద్: జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ల కోసం ప్రత్యేకంగా మైత్రి ట్రాన్స్ క్లినిక్ ఏర్పాటు చేశారు. క్లినిక్‌లో అన్ని ఏర్పాట్లు కల్పించారు. కాగా నేడు(శనివారం) మానుకోట ఎమ్మెల్యే మురళీనాయక్ చేతుల మీదుగా క్లినిక్‌ను ప్రారంభించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

500మంది ట్రాన్స్‌జెండర్లు..

జిల్లాలో 500 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నట్లు అధికారులు తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ, అనుబంధ వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల సాధికారతశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మైత్రి ట్రాన్స్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల విభాగం డైరెక్టరేట్ నుంచి రూ.10వేల నిధులు విడుదల అయ్యాయని అధికారులు పేర్కొన్నారు. ఈ నిధులతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన గదికి వాల్ పెయింటింగ్, ఫర్నిచర్ ఇతరత్రా ఏర్పాటు చేశారు. కాగా వారికోసం హెల్ప్‌లైన్ నంబర్ 155326 ఏర్పాటు చేశారు.



ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన మైత్రి ట్రాన్స్ క్లినిక్

ప్రతీ గురువారం వైద్య పరీక్షలు..

మైత్రి క్లినిక్‌లో డాక్టర్‌కు విధులు కేటాయించారు. కాగాప్రతీ గురువారం వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యసేవలు అందించనున్నారు. క్లినిక్‌ను ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ నేడు ప్రారంభిస్తారని అధికారులు తెలిపారు.

నేటినుంచి సీఎం కప్ క్రీడలు

- జనవరి 2వరకు నిర్వహణ
- గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు..
- 15నుంచి 36 ఏళ్లలోపు వారికి అవకాశం



మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు, యువత, క్రీడాకారులకు సీఎంకప్–2024 క్రీడా పోటీలు నిర్వహిస్తోంది. గ్రామీణ యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి.. గ్రామీణస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పలు క్రీడా పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.15నుంచి 36 ఏళ్లలోపు వారు క్రీడల్లో పాల్గొనే అవకాశం ఉంది.

జనవరి 2వరకు పోటీలు..

గ్రామీణ స్థాయిలో ఈ నెల 7నుంచి కబడ్డీ, ఖోఖో, వాలీవాల్ పోటీలను నిర్వహిస్తారు. కాగా గ్రామస్థాయిలో గ్రామ పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలి. ప్రభుత్వ పాఠశాల పీఈటీ క్రీడా పోటీలను ఈ నెల 7, 8 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. గ్రామస్థాయిలో గెలుపొందిన వారు మండల స్థాయిలో పాల్గొంటారు. ఈ నెల 10నుంచి 12వరకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తారు. ఈ మేరకు క్రీడాకారులు ఎంపీడీఓ, ఎంఈఓను సంప్రదించాలి. ప్రభుత్వ పాఠశాలల పీడీలతో క్రీడలు నిర్వహిస్తారు. మండల స్థాయిలో గెలుపొందిన క్రీడాకారులు ఈ నెల 16 నుంచి 21వరకు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించే జిల్లాస్థాయి క్రీడల్లో పాల్గొంటారు. అలాగే ఈ నెల 27 నుంచి జనవరి 2వ తేదీ వరకు రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్నాయి.

క్రీడలివే..

గ్రామస్థాయిలో కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, మండల స్థాయిలో అథ్లెటిక్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, హ్యాండ్‌బాల్, వ్యక్తిగత పోటీలు నిర్వహిస్తారు. కాగా మండల స్థాయి, జిల్లాస్థాయిలో గెలుపొందిన వారికి జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందిస్తారు. రాష్ట్రస్థాయికి ఎంపికై విజేతలుగా నిలిచిన వారికి మొదటి బహుమతి రూ.లక్ష నగదు, రెండో బహుమతి రూ.75వేలు, మూడో బహుమతి రూ. 35 వేలు అందజేస్తారు. వ్యక్తిగత క్రీడల్లో విజేతలకు రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ. 15 వేలు, మూడో బహుమతి రూ. 10వేలతో పాటు జ్ఞాపికలు, ప్రశంసపత్రాలు అందజేస్తారు. రాష్ట్రస్థాయి విజేతల ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రభుత్వం అవకాశాలు కల్పిస్తుంది.

క్రీడా పోటీలకు సర్వం సిద్ధం



గ్రామస్థాయి నుంచి మొదలుకొని మండల, జిల్లాస్థాయి వరకు జరిగే క్రీడా పోటీలకు కలెక్టర్ సహకారంతో అంతా సిద్ధం చేశాం. గ్రామస్థాయి నుంచి ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులు, యువత సీఎం కప్ క్రీడల్లో ఆడేవిధంగా చొరవ తీసుకోవాలి.

- ఓ.జ్యోతి, జిల్లా యువజన, క్రీడల శాఖ ఇన్‌చార్జ్ అధికారి

నాణ్యమైన భోజనం అందించాలి

- అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్

డోర్నకల్: ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అడిషనల్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో ఆదేశించారు. స్థానిక మైనారిటీ బాలికల గురుకులం, కస్తూర్బా పాఠశాలలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. వంటగదులు, బియ్యం, కిరాణసరుకులను పరిశీలించారు. వంట పాత్రలతో పాటు డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాలల రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ.. కస్తూర్బా, మైనారిటీ గురుకుల పాఠశాలల్లో నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని, నిత్యం పారిశుద్ధ్య పనులు నిర్వహించాలని, బాలికల ఆరోగ్య, మానసిక స్థితిగతులను పర్యవేక్షించాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఫుడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కళాశాలల స్థాయిలో ప్రిన్సిపాల్, హెచ్‌ఎంలు, మండలస్థాయిలో తహసీల్దార్లు, జిల్లాస్థాయిలో అడిషనల్ కలెక్టర్లు కమిటీలకు చైర్మన్లుగా ఉంటారని, విద్యార్థులకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహారం అందించడమే కమిటీల లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణవేణి, మైనారిటీ కళాశాల ప్రిన్సిపాల్ రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన ఎస్సైలు



ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్‌తో ఎస్సైలు

మహబూబాబాద్ రూరల్ : శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన ఏడుగురు ప్రొబేషనరీ ఎస్సైలు ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ను శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ మాట్లాడుతూ.. ప్రొబేషనరీ ఎస్సైలను నెల రోజుల శిక్షణ కోసం జిల్లా పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లకు కేటాయించామని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, నీతి నిజాయితీగా విధులు నిర్వర్తించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఎస్పీని కలిసినవారిలో ఎస్సైలు రవికుమార్, ఖాదర్ పాషా, నరేష్, శివరామకృష్ణ, మహబూబీ, అంజమ్మ, మౌనిక ఉన్నారు.

ఇంటింటికీ సీపీఎం..

- ఈ నెల 20వరకు ప్రజా సమస్యలపై సర్వే
- పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

నెహ్రూసెంటర్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 8నుంచి 20వ తేదీ వరకు ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం ద్వారా సర్వే నిర్వహించి ప్రజాపోరాటాలను ఉధృతం చేయాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీపీఎం జిల్లా విస్తృతస్థాయి సమావేశం గునిగంటి రాజన్న అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిలదీసేది ఎర్ర జెండాలేనని, భారతదేశం చుట్టూ ఉన్న దేశాల్లో ఎర్రజెండా రెపరెపలాడుతుందని పేర్కొన్నారు. భవిష్యత్ అంతా కమ్యూనిస్టులేదని, కార్మికులు, కర్షకులు, పేదలు ఎర్రజెండాకు అండగా నిలవాలని కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏడాది పాలనపై సంబురాలు చేసుకుంటున్న పాలకులకు హామీల అమలులో చిత్తశుద్ధి లేదని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మల్లన్నసాగర్ రైతులను జైల్లో నిర్బంధిస్తే కాంగ్రెస్‌పాలనలో ఫార్మాసిటీ పేరుతో రైతులపై కేసులు మోపుతున్నారని అన్నారు. వామపక్ష పార్టీల పోరాట ఫలితంగానే ఫార్మాసిటీ రైతులకు న్యాయం జరిగిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడి నిలదీసే సీపీఎంను ప్రజలు ఆదరించాలని కోరారు. అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మహిళా శక్తి క్యాంటీన్లతో స్వావలంబన

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తొర్రూరు: మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధిస్తారని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. డివిజన్ కేంద్రంలోని అన్నారం రోడ్డులోని ఐకేపీ కార్యాలయం ఎదుట గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను శుక్రవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలు స్వయం సమృద్ధి సాధించడమే కాక పది మందికి ఉపాధి చూపించే విధంగా ప్రభుత్వం మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రోత్సాహం కల్పిస్తుందన్నారు. మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ఆరు గ్యారంటీలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. అనంతరం మున్సిపాలిటీ కార్యాలయంలో రూ.37.94 లక్షలతో కొనుగోలు చేసిన వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, ఏపీఎం సంజీవరావు, కమిషనర్ శాంతికుమార్ పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ స్థల పరిశీలన

గూడూరు: మండల కేంద్రంలోని నర్సంపేట వైపు జాతీయ రహదారి పక్కన సర్వే నంబర్ 8 లోని 0.5 గుంటల ఖాళీ స్థలాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇదే స్థలంలో గతంలో రూ. 25 లక్షలకు 5 షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణానికి టెండర్ ప్రక్రియ జరిగిందని, కానీ కొన్ని కారణాల వల్ల ఆ టెండర్ రద్దు చేశారని తెలిపారు. దీంతో కొత్తగా జిల్లాకు వచ్చిన తాను ఈ స్థలాన్ని పరిశీలించి, తిరిగి ఇక్కడ 5 షాప్‌ల నిర్వహణకు కార్యాచరణ రూపొందించనున్నట్లు శ్రీనివాస్‌రావు తెలిపారు.



కమ్మేసిన పొగమంచు

మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున పొగమంచు కురిసింది. రహదారులు, రైల్వే ట్రాక్ పరిసరాలను పొగమంచు కమ్మేయడంతో వాహనాలు లైట్ల వెలుగుల్లో వెళ్లాయి. ఇక అప్, డౌన్ లైన్‌లో వెళ్లే రైళ్ల వేగం తగ్గించి లైట్ల వెలుతురులో ప్రయాణించాయి. – కేసముద్రం

ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్‌



అరెస్టు చూపిస్తున్న ఫారెస్ట్‌ అధికారులు

భూపాలపల్లి రూరల్‌: భూపాలపల్లి మండలంలోని కమలాపూర్‌ గ్రామంలో ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి రేంజ్‌ ఆఫీసర్‌ నరేష్‌ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఫారెస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు కమలాపూర్‌ గ్రామంలో ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా మొత్తం నలుగురు వ్యక్తులు కలిసి దుప్పిని వేటాడి మాంసం విక్రయించేవారని నేరం ఒప్పుకున్నారు. దీంతో మందారపు సారయ్య, మాందారపు రాములు, భీముని భిక్షపతి, ఏమేని ఐలయ్యలను అరెస్ట్‌ చేసి వన్య ప్రాణులు చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టులో రిమాండ్‌ చేసినట్లు ఆయన తెలిపారు.

హైటెక్‌ హంగులు



హైటెక్‌ హంగులతో కాజీపేట జంక్షన్‌ నమూనా



అప్పర్‌క్లాస్‌ వెయిటింగ్‌హాల్‌ నమూనా

కాజీపేట జంక్షన్‌కు 'అమృత్‌ భారత్‌' నిధులు

- జంక్షన్‌కు అత్యాధునిక అందాలతో ఆధునీకరణ
- 120 ఏళ్ల చరిత్ర గల కాజీపేట స్టేషన్‌
- వరల్డ్‌ క్లాస్‌ రైల్వే స్టేషన్‌గా రీమోడలింగ్‌
- స్టేషన్‌ ఎదుట రైల్‌ కోచ్‌ రెస్టారెంట్‌
- ప్లాట్‌ఫాంల విస్తరణ.. మరో రెండు అదనపు ప్లాట్‌ఫాంలు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌ను అమృత్‌ భారత్‌ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్‌ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. 1904లో నిర్మించిన నాటి కాజీపేట రైల్వే స్టేషన్‌ దినదినాభివృద్ధి చెంది నేడు ఉత్తర, దక్షిణ దేశ ప్రాంతాలకు గేట్‌వేగా ఉంటుంది.



ప్రస్తుత కాజీపేట జంక్షన్‌లోని ప్లాట్‌ఫాంలు

120 ఏళ్ల చరిత్ర గల అతిపురాతన కాజీపేట రైల్వే స్టేషన్‌ రైల్వేపరంగా కాజీపేట నుంచి ఢిల్లీ వరకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్‌ రైల్వే స్టేషన్‌గా అత్యాధునీకరించేందుకు కేంద్రం అమృత్‌భారత్‌ నిధులతో శ్రీకారం చుట్టింది. గ్రానైట్‌రాయితో నిర్మాణాలు, కొత్త కొత్త డిజైన్‌లతో రైల్వే కట్టడాలు, ఎంతో అందాన్నిచ్చే పేయింటింగ్స్‌, గ్రీనరీ గార్డెన్స్‌ ఏర్పాటుతో కాజీపేట జంక్షన్‌ న్యూ లుక్‌తో ప్రయాణికులు కొద్ది నెలల్లో చూడబోతున్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అమృత్‌భారత్‌ నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్‌ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికులకు అప్పర్‌క్లాస్‌ వెయిటింగ్‌ హాల్‌ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్‌ బ్లాక్‌, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్‌ గార్డెన్‌, వాహనాల రోడ్స్‌, పాత్‌వే, పార్కింగ్‌, సర్క్యులేషన్‌ ఏరియా స్మూత్‌ ట్రాఫిక్‌ ఫ్లో, రెండు లిఫ్టులు, 3 ఎస్కెలేటర్లు, ప్యాసింజర్‌ ఫ్రెండ్లీ సైన్‌ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్‌ హోటల్‌, కమర్షియల్‌ డెవలప్‌మెంట్‌ నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే కాజీపేట జంక్షన్‌లో 100 ఏళ్ల కాలం నాటి ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్‌ ఫుట్‌ ఓవర్‌ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫాంల ఆధునీకరణ పనులు, రైల్వే స్టేషన్‌ వరకు పూర్తి స్థాయిలో కవర్‌ షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జంక్షన్‌ నుంచి కాజీపేట చౌరస్తా వరకు అభివృద్ధి నిర్మాణ పనులు అబ్బురపరిచే విధంగా చేపడుతున్నారు. కాజీపేట చౌరస్తా నుంచి ప్రయాణికులు రైల్వే స్టేషన్‌ లోపలికి వెళ్లే ఎంట్రెన్స్‌, రైల్వే స్టేషన్‌ వరకు ఎటు చూసిన ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రానికి వచ్చినట్లుగా అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. అన్ని విధాల రినోవేషన్‌ పనులు పూర్తి చేసి కాజీపేట జంక్షన్‌ను వచ్చే నెల (జనవరి)లో ప్రారంభించేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 5 ప్లాట్‌ఫాంలు..



జంక్షన్‌లో నిర్మాణ దశలో మోడల్‌ ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి

ఉత్తర తెలంగాణలో అతిప్రధానమైన కాజీపేట జంక్షన్‌ రైల్వే ప్లాట్‌ఫాంల విస్తరణకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్లాట్‌ఫాంల విస్తరణ పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు త్వరలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్‌ నుంచి ప్రతీ రోజు వివిధ ప్రాంతాలకు సుమారు 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. న్యూఢిల్లీ, చెన్నై, హైదరాబాద్‌ నుంచి వచ్చి వెళ్లే అప్‌ అండ్‌ డౌన్‌ రైళ్లకు ముఖ్య కూడలిగా కాజీపేట జంక్షన్‌ ఉంది. వివిధ రూట్‌ల నుంచి కాజీపేట జంక్షన్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్స్‌ రైళ్ల రవాణా ట్రాఫిక్‌తో రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 1, 2, 3వ నంబర్‌ ప్లాట్‌ఫాంలు బిజీ బిజీగా మారి సరిపోవడం లేదు. రైళ్ల రద్దీతో రైళ్లను అవుటర్‌ సిగ్నల్స్‌ వద్ద నిలిపేయాల్సి వస్తుంది. నిర్ణీత సమయానికి రావాల్సిన రైళ్లు ఆలస్యం కావడంతో పాటు ప్రయాణికుల సమయం వృథా అవుతుంది. దీంతో అదనపు ప్లాట్‌ఫాంల విస్తరణకు ప్రతిపాదనలు పంపిన అధికారులు మరో రెండు (4, 5వ నంబర్‌) ప్లాట్‌ఫాంలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. కాజీపేట జంక్షన్‌ నుంచి ప్రయాణించే రైళ్లతో పాటు కాజీపేట మీదుగా వివిధ మార్గాలకు ప్రయాణించే పలు రైళ్లకు ట్రాఫిక్‌ సమస్య ఉండదని రైల్వే అధికారులు అంటున్నారు.

అంతర్జాతీయ త్రోబాల్‌ పోటీల్లో బంగారు పతకం



గోల్డ్‌మెడల్‌ అందుకుంటున్న జ్యోతి

పలిమెల : కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్‌ పోటీల్లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ జట్టులో జేఎస్‌ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన కావేరి జ్యోతి పాల్గొని దేశం తరపున ఆడి బంగారు పతకం సాధించడంతో స్థానికుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేపల చెరువు పరిశీలన



చేపల చెరువును పరిశీలిస్తున్న రాజన్న

మామునూరు: ఖిలా వరంగల్‌ మండలం బొల్లికుంట పరిసరాల్లో ఫోర్ట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన సిద్ధం రాము ఏర్పాటు చేసిన చేపల చెరువును శుక్రవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్యశాస్త్రవేత్త డాక్టర్‌ గణేష్‌తో కలిసి కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ రాజన్న పరిశీలించారు. శీతాకాలంలో కొర్ర మీను చేపలకు తీసుకోవాల్సిన మేత యాజమాన్య పద్ధతులను వివరించారు. చెరువు నీటి ఉష్ణోగ్రత తగ్గడంతో చేపల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాల మిశ్రమాన్ని చేపల దానాతో పాటు కలిపి వినియోగించాలని మత్స్యకారులకు సూచించారు. అనంతరం రైతు సిద్ధం రాముకు చేప ఎదుగుదలకు గ్రోత్‌ ప్రమోటర్‌ మందును శాస్త్రవేత్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ రాజు, రైతులు పాల్గొన్నారు

సీపీఎస్‌ అమలుకు నిరవధిక నిరాహార దీక్ష

- ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్‌



సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్‌

జనగామ రూరల్‌: సీపీఎస్‌ సాధనకు నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే అభ్యర్థి పూల రవీందర్‌ అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని ఓ ఫంక్షన్‌ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్‌ రద్దు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కేజీబీవీ, ఎస్‌ఎస్‌ఏ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలకు కనీస వేతన చట్టం వర్తింపజేయాలన్నారు. కార్పొరేట్‌ వైద్యసేవలతో కూడిన హెల్త్‌కార్డులు అందించాలన్నారు. గిరిజన సంక్షేమశాఖలో పండిట్‌, పీఈటీ పోస్టులను అప్‌డేషన్‌ చేయాలన్నారు. గురుకుల పాఠశాలల పని వేళలను ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అయ్యేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. జాక్టో చైర్మన్‌ సదానందం గౌడ్‌ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న పూల రవీందర్‌ను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో చాప్టర్‌ జనరల్‌ సెక్రటరీ కె. కృష్ణుడు, ఎండీ అబ్దుల్లా, హేమచంద్రుడు దానయ్య, రాధాకృష్ణ, సచ్చిదానందరెడ్డి, నగేష్‌ యాదవ్‌, బీసీటీఏ జనగాం జిల్లా ప్రెసిడెంట్‌ ఎలికట్ట యాదగిరి, జనరల్‌ సెక్రటరీ మామిండ్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు మండల సుభాష్‌, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న కేంద్రం

- సీపీఐ ఎంఎల్‌ లిబరేషన్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్‌ భట్టాచార్య



సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్‌ భట్టాచార్య

వరంగల్‌: రాజ్యాంగ స్ఫూర్తికి బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని సీపీఐ ఎంఎల్‌ లిబరేషన్‌ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్‌ భట్టాచార్య అన్నారు. శుక్రవారం ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో వరంగల్‌ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షత వహించగా తొలుత అమరవీరులకు నివాళులర్పించారు. ఆజం జాహి మిల్లు గ్రౌండ్‌ నుంచి పోచమ్మ మైదాన్‌ వరకు ర్యాలీ నిర్వహించారు. కాశిబుగ్గ సెంటర్‌లో అంబేడ్కర్‌ విగ్రహానికి పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్‌ భట్టాచార్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అణగారిన వర్గాల అభ్యున్నతికి, మానవ హక్కుల కోసం పోరాడి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే విలువలు కాపాడేందుకు రాజ్యాంగంలో పొందుపరిచిన మహనీయుడు అంబేడ్కర్‌ అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్‌ బ్యూరో సభ్యులు శంకర్‌, కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్‌ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌ రాజా, రొయ్యల రాజు, శ్రీనివాస్‌, గుమ్మడి రాజుల సాంబయ్య, గోల్కొండ కుమార్‌, మారేపల్లి మల్లేష్‌, రజిత, ఖాజా మొహినుద్దిన్‌ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్‌ రైలుబోగిలో పొగలు



గూడ్స్‌ రైలుబోగి నుంచి వెలువడుతున్న పొగ

స్టేషన్‌ఘన్‌పూర్‌: రామగుండం నుంచి సికింద్రాబాద్‌ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్‌ రైలుబోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్‌ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గు లోడ్‌తో వైటీపీ 4 అనే గూడ్స్‌ రైలు రామగుండం నుంచి సికింద్రాబాద్‌ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైలు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకోగా ఓ బోగి నుంచి పొగలు వస్తున్న విషయాన్ని రైల్వే సిబ్బంది గమనించి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించగా రైలును ఘన్‌పూర్‌ రైల్వేస్టేషన్‌లో నిలిపి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్‌ జమీందార్‌ లింగయ్య, ఫైర్‌మన్‌ గణేష్‌ ఫైరింజన్‌తో రైల్వే ఒకటవ ప్లాట్‌ఫారంపైకి వచ్చారు. అయితే రైలు రైల్వేవిద్యుత్‌ మెయిన్‌లైన్‌లో ఉండటంతో విద్యుత్‌ సరఫరా నిలిపివేసేందుకు సంబంధిత కంట్రోలర్‌కు స్టేషన్‌మాస్టర్‌ సమాచారం అందించారు. విద్యుత్‌ సరఫరా నిలిపేసిన అనంతరం ఫైర్‌ ఇంజన్‌ సిబ్బంది రైలు బోగిలో నీటిని కొట్టగా పొగలు తగ్గిపోయాయి. అయితే బొగ్గు లోడ్‌ కావడంతో వేడితో బొగ్గు అంటుకుని పొగలు వ్యాపించి ఉంటాయని రైల్వే సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. సకాలంలో సిబ్బంది గమనించి మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు.

రిజిస్ట్రార్‌ను అడ్డుకున్న విద్యార్థిసంఘాలు



అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్‌: డాక్టర్‌ బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌ వర్ధంతిని నిర్వహించడంలో యూనివర్సిటీ అధికారులు ఆలస్యం చేశారని మండి పడుతూ వివిధ విద్యార్థిసంఘాల నాయకులు రిజిస్ట్రార్‌ మల్లారెడ్డిని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... శుక్రవారం కేయూ రిజిస్ట్రార్‌ ఆచార్య పి. మల్లారెడ్డి ఉదయం 11.45 గంటలకు దూరవిద్యాకేంద్రం వద్ద ఉన్న అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసేందుకు రాగా పలు విద్యార్థి సంఘాల బాధ్యులు అడ్డుకొని ఉదయమే కార్యక్రమానికి రావాల్సి ఉండగా ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ పూలమాల వేయకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ అధికారుల తీరుపై మండిపడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్‌ మల్లారెడ్డి మాట్లాడుతూ కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్‌ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉండేదని, డైరెక్టర్‌ అందుబాటులో లేకపోవడంతో అంబేడ్కర్‌ వర్ధంతి ఉందని తెలుసుకొని కార్యక్రమ నిర్వహణకు వచ్చానని రిజిస్ట్రార్‌ తెలిపారు. అలాగే దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌ ఆచార్య వి. రాంచంద్రంకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. విద్యార్థిసంఘాల బాధ్యులకు సర్దిచెప్పిన తర్వాత రిజిస్ట్రార్‌ అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్‌ ఆశయాలను కొనసాగించాలి..

అంబేడ్కర్‌ ఆశయాలను కొనసాగించాలని రిజిస్ట్రార్‌ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. బాబా సాహెబ్‌ వర్ధంతి సందర్భంగా దూరవిద్యాకేంద్రంలోని అంబేడ్కర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్‌ ఆచార్య రాంచంద్రం, కేయూ ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ ప్రొఫెసర్‌ ఈసం నారాయణ, మహిళా ఇంజనీరింగ్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.బిక్షాలు, కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్‌ అసోసియేషన్‌ జనరల్‌ సెక్రటరీ డాక్టర్‌ పుల్లా శ్రీనివాస్‌, ఆచార్య గాదె సమ్మయ్య, రిటైర్డ్‌ ఆచార్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్‌ మృతి



శివకుమార్‌ (ఫైల్‌)

కాటారం: వివాహ శుభ కార్యానికి ఫొటోలు తీయడానికి వెళ్తూ ఓ యువ వీడియోగ్రాఫర్‌ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మాబాద్‌కు చెందిన ఆడెపు శివకుమార్‌ (21) అనే యువకుడు వీడియోగ్రాఫర్‌ వృత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం భూపాలపల్లిలో జరిగే ఓ వివాహ శుభకార్యానికి ఫొటోలు, వీడియో తీయడానికి శ్రీసోని ఫొటో స్టూడియో యజమాని గంధం వీరస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కాటారం మండల కేంద్రానికి సమీపంలోకి చేరుకోగానే ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న టిప్పర్‌ అకస్మాత్తుగా యూటర్న్‌ తీసుకోవడంతో బైక్‌ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న వీరస్వామి, వెనకాల కూర్చున్న శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శివకుమార్‌ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రోహిత్‌కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్‌ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి జారి పడి వ్యక్తి..



కేశగాని వీరయ్య (ఫైల్‌)

తొర్రూరు రూరల్‌: తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కేశగాని వీరయ్య (57) గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే గ్రామ శివారులో కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు పైభాగం వరకు వెళ్లిన క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. దీంతో తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కిందపడిన కొన్ని గంటల తర్వాత స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు మహేష్‌, సోమన్న, భార్య కనకతార ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌ తెలిపారు.

ముగిసిన రైల్వే ఎన్నికలు

- 12న ఫలితాలు



పోలింగ్‌ శిబిరం వద్ద మురళీకృష్ణ, నాయకులు

కాజీపేట రూరల్‌: కాజీపేట జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా రైల్వే గుర్తింపు సంఘం కోసం రెండు రోజుల పాటు జరిగిన రైల్వే వన్‌ ఇండస్ట్రీ వన్‌ యూనియన్‌ ఎన్నికలు శుక్రవారం ముగిశాయి. ముగింపులో రైల్వే రన్నింగ్‌స్టాఫ్‌ నుంచి లోకోపైలెట్లు, అసిస్టెంట్‌ లోకో పైలెట్లు, ఆపరేటింగ్‌ డిపార్ట్‌మెంట్‌ నుంచి ట్రెన్‌ మేనేజర్లు (గార్డులు) పోలింగ్‌ సెంటర్లకు వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. రైల్వే ఎంప్లాయిస్‌ సంఘ్‌ సికింద్రాబాద్‌ డివిజన్‌ ప్రెసిడెంట్‌ కొత్త మురళీకృష్ణ పోలింగ్‌ శిబిరాలను సందర్శించి సంఘ నాయకులను కలిసి ఓటింగ్‌ సరళిని తెలుసుకున్నట్లు రైల్వే సంఘ్‌ నాయకులు తెలిపారు. రైల్వే ఎంప్లాయిస్‌ సంఘ్‌ కాజీపేట లోకో రన్నింగ్‌ బ్రాంచీ వర్కింగ్‌ చైర్మన్‌ పాక రాజ్‌కుమార్‌ మాట్లాడుతూ కాజీపేటలో లోకోపైలెట్లు, ట్రెన్‌ మేనేజర్లు కలిపి 848 మంది ఓటర్లు ఉండగా 780 ఓట్లు పోలైనట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్‌లో మొత్తం 3,474 ఓటర్లు ఉండగా మూడు రోజుల ఎన్నికలో 3,148 ఓట్లు పోలైనట్లు (91 శాతం) తెలిపారు. రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరుగుతున్న ఎన్నికల ఫలితాలను ఈ నెల 12వ తేదీన ప్రకటించనున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతల స్వీకరణ



రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్‌: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్‌ అండ్‌ బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ప్రొఫెసర్‌ కట్ల రాజేందర్‌ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య పి. అమరవేణి, ప్రొఫెసర్‌ నర్సింహాచారి, అధ్యాపకులు డాక్టర్‌ ఫణీంద్ర, పరిశోధక విద్యార్థులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే పరీక్షల విభాగంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్‌ తిరుమలాదేవి, డాక్టర్‌ సౌజన్య, నాగరాజులు రాజేందర్‌, మాజీ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని సన్మానించి అభినందనలు తెలిపారు.

వివాహిత అదృశ్యం

నెల్లికుదురు: ఓ వివాహిత బిడ్డతో సహా అదృశ్యమైన ఘటన మహబూబాబాద్‌ జిల్లా నెల్లికుదురు మండలకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్‌ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రం జాలోన్‌ జిల్లా సిరిసా మండలం అభేదిపూర్‌ గ్రామానికి చెందిన గోవింద్‌ సింగ్‌, రాఖీదేవి దంపతులు జీవనోపాధి కోసం నెల్లికుదురు మండలకేంద్రంలో నివాసం ఉంటున్నారు. మూడేళ్లుగా పానీ పూరి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 15 నెలల బాబు ఉన్నాడు. ఈ నెల 5న తన కుమారుడు, భార్య రాఖీదేవి అదృశ్యమయ్యారని, చుట్టు పక్కల వెతికినా కనిపించడం లేదని భర్త గోవింద్‌సింగ్‌ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీరు సీసాలో చెత్త!

- వైన్‌షాపు ఎదుట ఆందోళన



బీరుసీసా అడుగు భాగంలో వచ్చిన చెత్త

కేసముద్రం: బీరు సీసాలో చెత్తాచెదారం వచ్చిన సంఘటన మహబూబాబాద్‌ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్‌ షాపులో కొందరు వ్యక్తులు కలిసి బీర్లు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఆ బీర్లను తాగే క్రమంలో ఓ బీరుసీసా అడుగు భాగంలో చెత్త (వ్యర్థపదార్థం) కనిపించింది. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తులు వైన్‌షాపు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై మురళీధర్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. కంపెనీ నుంచి వచ్చిన బీరుసీసాలనే తాము విక్రయిస్తున్నామంటూ షాపు నిర్వాహకులు చెప్పుకొచ్చారు.